క్లుప్తంగా

గీత కార్మికులకు ఐడీ కార్డులు



కార్డులు అందజేస్తున్న జెడ్పీటీసీ రవికుమార్

బలిజిపేట: గీత కార్మికులకు మంజూరైన ఐడీ కార్డులను జెడ్పీటీసీ రవికుమార్ శనివారం పంపిణీ చేశారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ద్వారా మండలంలో 30మంది గీత కార్మికులకు ఐడీ కార్డులు మంజూరయ్యాయి. కల్లుగీత కార్మికులలో వృత్తి చేసే వారికి 50సంవత్సరాలు దాటిన వారికి వీటిని మంజూరు చేస్తారు. అందులో భాగంగా 30మందికి మంజూరైనట్టు తెలిపారు. గలావల్లికి చెందిన తొమ్మిది మంది కార్మికులకు కార్డులను పంపిణీ చేశారు. కార్పొరేషన్ ద్వారా పథకాలు మంజూరైతే వీటి ద్వారా వారికి లబ్ధి చేకూరే అవకాశాలున్నాయని తెలిపారు. కొత్త పింఛను మంజూరుకు దీనిని వినియోగించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కె.వెంకటరమణ, ఎ.పోలినాయుడు, ఎస్.కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సారా పట్టివేత

సాలూరు: పట్టణంలోని భాష్యం స్కూల్ సమీపంలో సారా విక్రయిస్తున్న కాడేలు లక్ష్మి, రెడ్డి పాలకుమారిల నుంచి 40 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ జీడీ బాబు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ, ముందస్తు సమాచారం మేరకు దాడులు చేపట్టామన్నారు. అలాగే గొల్లాది శ్రీను అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై 20 లీటర్ల సారా తరలిస్తూ డబ్బివీధి వద్ద పట్టుబడ్డాడన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఏరియా ఆస్పత్రిలో డెర్మటాలజిస్ట్ నియామకం

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రిలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో వైద్యుల నియామకానికి చర్యలు తీసుకుంది. ఆస్పత్రిలో కొత్తగా డెర్మటాలజిస్ట్(చర్మవ్యాధి నిపుణులు) డాక్టర్ మిథాలిని నియమిస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న స్పెషలిస్టు వైద్యుల సంఖ్య 21కి చేరింది. జనరల్ మెడిసిన్‌తో పాటు ఇద్దరు గైనకాలజిస్టులు, చిన్నపిల్లల వైద్యులు ఉన్నారు. అలాగే డెంటిస్టు, నేత్రవైద్యులు, ఈఎన్‌టీ డాక్టర్, ఆర్థో, జనరల్ సర్జన్, సివిల్ అసిస్టెంట్ సర్జన్‌తో పాటు సాధారణ వైద్యులు ఉన్నారు. పూర్తిస్థాయిలో మందులు, వైద్యులు అందుబాటులో ఉన్నారని సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఏరియా ఆస్పత్రి సూపరెండిండెంట్ బి.శ్రీనివాసరావు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం రేపు

గరుగుబిల్లి: కురుపాం మండలం చినమేరంగిలో సోమవారం ఉదయం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల కన్వీనర్, ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు శనివారం తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు హాజరుకావాలని కోరారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న డాక్టర్ రవీంద్రకుమార్

వీరఘట్టం: యువత రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని పాలకొండ ఏరియా ఆస్పత్రి చిన్నపిల్లల వైద్యనిపుణుడు డాక్టర్ రవీంద్రకుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని పనసనందివాడ గ్రామంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. గ్రామానికి చెందిన 35 మంది యువత రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొరికాన సన్యాసినాయుడు, కుసిమి, అన్నవరం, బిటివాడ ఆస్పత్రుల వైద్యాధికారులతో పాటు పాలకొండ ఏరియా ఆస్పత్రి సిబ్బంది సేవలందించారు.

సస్యరక్షణపై అవగాహన



దోలమడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఓ

పాలకొండ రూరల్: జీడి, మామిడి తోటల్లో సస్యరక్షణపై రైతులు అవగాహ పెంచుకోవాలని ఉద్యానవన శాఖాధికారి తమ్మినేని అమరేశ్వరి అన్నారు. మండలంలోని డోలమడ, బర్న, ఎం.సింగుపురం సమీపంలో మామిడి తోటలు సాగుచేస్తున్న రైతులకు సర్యరక్షణ చర్యలపై శనివారం అవగాహన కల్పించారు. పూత రాలిపోకుండా చేపట్టాల్సిన చర్యలను వివరించారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. గ్రామస్థాయిలో ఉన్న రైతుభరోసా కేంద్రాల ద్వారా శాఖా పరంగా అందిస్తున్న సేవలు అందిపుచ్చుకోవాలన్నారు.

టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలోకి...

- 40 కుటుంబాల చేరిక
- సంక్షేమం, అభివృద్ధి చూసే..
- ఎమ్మెల్యే అలజంగి జోగారావు



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

పార్వతీపురం టౌన్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై తెలుగుదేశం పార్టీని వీడి ఆ పార్టీ శ్రేణులు వైఎస్సార్‌సీపీలో చేరుతున్నాయని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. పార్వతీపురం పట్టణంలోని ఏడో వార్డుకు చెందిన 40 కుటుంబాలు టీడీపీకి గుడ్‌బై చెప్పి వైఎస్సార్‌సీపీలో శనివారం చేరారు. వీరికి ఎమ్మెల్యే జోగారావు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి పాలనను మెచ్చి పార్టీలోకి వచ్చే వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి పార్టీ శ్రేణులు విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. గత టీడీపీ హయాంలో జరిగిన నష్టం, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు జరుగుతున్న సంక్షేమ లబ్ధి, అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ బలోపేతమే లక్ష్యంగా అంతా పని చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, వార్డు కౌన్సిలర్ రణభేరి చిన్నంనాయుడు, నాయకులు బూరి కృష్ణ, సువ్వాడ శ్రీనివాసరావు, జి.చిరంజీవి, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పీహెచ్‌సీల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంఓ డాక్టర్ జగన్మోహనరావు

సీతానగరం: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం పీహెచ్‌సీల్లో అవసరమైన మందులు అందుబాటులో ఉంచిందని వీటిని వినియోగించడం ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా మలేరియా నివారణాధికారి(డీఎంఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. మండల కేంద్రంలో జరిగిన ఫ్యామిలీ కాన్సెప్ట్ విధానంతో శనివారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని, పీహెచ్‌సీలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రులకు వివిధ రకాల కారణాలతో అనారోగ్యానికి గురైన వారు రోగ నివారణకు వచ్చిన వారికి సమస్యలు తెలుసుకోవాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన తరువాత మందులు వైద్య సిబ్బంది పర్యవేక్షణలో వినియోగించేలా చూడాలన్నారు. పీహెచ్‌సీలో అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలన్నారు. డాక్టర్ పావని, సీహెచ్‌ఓ ఎస్‌వీ రమణ, పీహెచ్‌సీ సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీ, 104 సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



మన గ్రోమోర్ ఎరువుల షాపులో రికార్డులను పరిశీలిస్తున్న ఏడీఏ నిర్మలాజ్యోతి

సీతానగరం: మండల కేంద్రంలోని లైసెన్స్ పొందిన ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను జీఎల్‌పురం ఏడీఏ అలజంగి నిర్మలజ్యోతి, ఏఓ ఎస్.అవినాష్‌తో కలిసి శనివారం తనిఖీ చేశారు. షాపుల్లో ఉన్న నిల్వలు, రికార్డుల్లో ఉన్న నిల్వలు, విక్రయించిన రికార్డుల్లో ఉన్న సరుకులను పరిశీలించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ స్టోరేజ్ ఎగ్రిమెంట్‌లు, జీఎస్టీ వివరాలు, బిల్లు బుక్‌ల వివరాలను షాపు యజమానులు సరిగా నిర్వహించాలని కోరారు. నిల్వల రికార్డులను పరిశీలించుకోవాలని కోరారు. గుర్తింపు పొందిన ఎరువుల కంపెనీల నుంచి కొనుగోలు చేసి రైతులకు పంపిణీ చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా ఎరువులు పురుగుల మందులున్నట్లయితే చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.

ప్రారంభమైన ‘అభిలాష’



మావుడి గ్రంథాలయంలో పుస్తకాలను అందిస్తున్న సచివాలయ సిబ్బంది

పార్వతీపురం: జిల్లా అధికార యంత్రాంగం యువతకు భరోసాగా నిలిచేందుకు ప్రాంభించిన ‘అభిలాష’(ఎక్సిసబుల్ బుక్స్ ఇనేషియేటివ్ ఫర్ బుక్స్ లెర్నింగ్ అండ్ సోషల్ ఎడ్వాన్స్‌మెంట్) కార్యక్రమంపై యువత అభిరుచి ప్రారంభమైంది. జిల్లాలోని వీరఘట్టం, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, మక్కువ, సాలూరు తదితర మండలాలలో 97 గ్రామ సచివాలయాలలో అభిలాష గ్రంథాలయాలు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు యువతను పెద్ద ఎత్తున ఆకర్షిస్తున్నాయి. అభిలాష గ్రంథాలయాలలో 66 రకాల 12,804 పుస్తకాలను ఏర్పాటు చేశారు. వీటిని యువత వినియోగించి పోటీ పరీక్షలకు సిద్ధం అయ్యేందుకు అవకాశం ఉంటుంది. నిరుద్యోగ యువతకు కావల్సిన పుస్తకాలను అందుబాటులో వుంచడమే లక్ష్యంగా ప్రభుత్వం అభిలాష గ్రంథాలయాలను ఏర్పాటు చేసింది. సివిల్స్, గ్రూప్స్, యూపీఎస్సీ, బ్యాంకింగ్, ఆర్‌ఆర్‌బీ, జేఈఈ, నీట్ తదితర పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను ఈ గ్రంథాలయాలలో ఏర్పాటు చేశారు. గ్రంథాలయాలలో పుస్తకాలు అందుబాటులో ఉండటంతో యువత సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు. గిరిశిఖర గ్రామాల సైతం గ్రంథాలయాలను ఏర్పాటు చేయడంతో గిరిజన యువత వినియోగించుకొనేందుకు అవకాశం లభించింది.

నేడు వైఎస్సార్‌సీపీ సన్నాహక సమావేశం

సాలూరు: ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం వెలమపేట కల్యాణ మంటపం వద్ద వైఎస్సార్‌సీపీ సన్నాహక సమావేశం నిర్వహించనున్నారు.

ఈ నెల 27న భీమిలిలో సీఎం జగన్ మోహన్ రెడ్డి ఎన్నికల శంఖారావం నిర్వహించనున్న నేపథ్యంలో నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, జేసీఎస్ కన్వీనర్లు, గృహ సారథులు, తదితర వైఎస్సార్‌సీపీ శ్రేణులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి కార్యాలయవర్గాలు ఒక ప్రకటనలో తెలిపాయి.

వికసిత్ భారత్ పథకాలపై అవగాహన



ఆర్.వెంకంపేట గ్రామసభలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రసాద్

సీతానగరం:

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వికసిత్ భారత్ గ్రామ సభలతో ప్రజలు తెలుసుకోవాలని ఎంపీడీఓ ప్రసాద్ అన్నారు. మండలంలో జరుగుతున్న వికసిత్ భారత్ కార్యక్రమాల్లో భాగంగా ఆర్.వెంకంపేట, రామవరం, రెడ్డివానివలస గ్రామాల్లో జిల్లా సమన్వయకర్త రెడ్డి సింహాచలం ఆధ్వర్యంలో శనివారం గ్రామసభలు జరిగాయి. ఈ మేరకు ఎంపీడీఓ ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భాగస్వామ్యంతో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ఉజ్వల పథకం ద్వారా ఉచిత వంట గ్యాస్ పంపిణీ, గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, గ్రామీణాభివృద్ధికి తోడ్పాటు తదితర అంశాలను వివరించారు. గ్రామసభలు నిర్వహించే ప్రాంగణంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ల పర్యవేక్షణలోఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ, పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

చెట్టును ఢీకొన్న బైక్

- వాహనచోదకుడికి గాయాలు

పాచిపెంట: అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడికి తీవ్ర గాయాలైన సంఘటన స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి 9 గంటల సమయంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బవిరెడ్డి పవన్‌కుమార్(22) శనివారం సాయంత్రం వ్యక్తిగత పని నిమిత్తం సాలూరు వెళ్లి తిరిగి రాత్రి 9 గంటల సమయంలో పాచిపెంట వస్తున్నాడు. పోలీస్‌స్టేషన్ సమీపంలోకి వచ్చేసరికి బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టాడు. దీంతో పవన్‌కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని కుటుంబ సభ్యులు ప్రైవేట్ వాహనంలో సాలూరు సీహెచ్‌సీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నారాయణరావు తెలిపారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

సీతంపేట: స్థానిక ఐటీడీఏ వద్ద శనివారం వేకువజామున పాలకొండ నుంచి కొత్తూరు వైపు వెళ్తున్న భారీ లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో డివైడర్‌పై ఉన్న విద్యుత్ స్తంభం విరిగిపడింది.

ముగిసిన ఆడుదాం.. ఆంధ్రా

మండల క్రీడా పోటీలు



షటిల్‌కాక్ టీమ్ సభ్యులతో ఎంపీడీఓ ప్రసాద్



విజేతగా నిలిచిన వాలీబాల్ జట్టు



కబడ్డీ విజేతలకు బహుమతులిస్తున్న ఎంపీడీఓ

సీతానగరం: గ్రామీణ క్రీడలను ప్రోత్సహించడం ద్వారా ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మించేందుకు జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం... ఆంధ్రా క్రీడా మండల స్థాయి పోటీలు శనివారం ముగిశాయి. మండలంలో జోగింపేట బీఆర్ అంబేడ్కర్, సీతానగరం ఉన్నత పాఠశాలల క్రీడా మైదానంలో ఈ నెల 5 నుంచి ప్రారంభమైన ఈ పోటీలు శనివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఎంపీడీఓ ప్రసాద్ మాట్లాడుతూ మండల స్థాయిలో కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, క్రికెట్, వాలీబాల్ సెమీఫైనల్స్ క్రీడా పోటీలు జరిగాయన్నారు. శనివారం ఫైనల్ క్రికెట్ పోటీల్లో బూర్జ - జానుమల్లువలస జట్ల మధ్య పోటీ జరగ్గా జానుమల్లువలస జట్టు విజయం సాధించింది. బ్యాడ్మింటన్‌లో పెదబోగిలి, షటిల్‌కాక్ పోటీల్లో సీతానగరం, కబడ్డీ పోటీల్లో సూరంపేట జట్టు, ఖోఖోలో జోగింపేట జట్లు గెలిచాయి. ఈ జట్లు నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్టు ఎంపీడీఓ తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కె.కుమారవర్మ దయానిధిపురం ఉప సర్పంచ్ సీహెచ్ సింహాచలం, జోగింపేట సర్పంచ్ కె.సింహాచలం, ఆయా విద్యాలయాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



బూర్జ - జానుమల్లువలస క్రికెట్ జట్లకు టాస్ వేస్తున్న నిర్వాహకులు

ప్రకృతి వ్యవసాయంతో మేలు



మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు

సీతానగరం: ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలని, ఆరోగ్యకరమని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రతినిధులు మానస, తిరుపతి, దేవీ ప్రసాద్ అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయం ఆవరణలో బందలుప్పి రైతులు ప్రకృతి వ్యవసాయ విధానంతో సాగు చేసిన వ్యవసాయ ఉత్పత్తు(కూరగాయలు)ల ప్రదర్శనతో పాటు విక్రయాలను శనివారం చేపట్టారు. కార్యక్రమంలో పాల్గొన్న మానస, తిరుపతి, దేవీప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంతో పండించిన కూరగాయల పంటలు ప్రజలకు ఆరోగ్యకరమన్నారు. ప్రకృతి వ్యవసాయ విధానంతో పండించిన కూరగాయలను విస్తారంగా కొనుగోలు చేయనున్నట్టు తెలిపారు. దీంతో ప్రకృతి వ్యవసాయ పంట దినుసులకు మార్కెట్‌లో గిరాకీ ఎక్కువగా ఉన్నందున రైతులు ప్రకృతి వ్యవసాయ పంటల సాగుకు అధిక ప్రాధాన్యతనిస్తున్నారని అన్నారు. అలాగే పొలంలో తీసిన తాజాగా ఉన్న పంటను రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేయడం వల్ల కొనుగోలుదారునికి, విక్రయదారునికి ఆర్థికంగా లాభపడుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, సీఆర్పీలు దానబాబు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు పక్కా ప్రణాళిక



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు రవికుమార్

బలిజిపేట: రానున్న వార్షిక సంవత్సరానికి సంబంధించిన పనుల ప్రణాళిక తయారుచేసేటపుడు గ్రామాల్లో రైతులకు, సామాజిక అవసరాలకు సంబంధించిన అభివృద్ధి పనుల ప్రణాళిక తయారుచేయాలని జెడ్పీటీసీ ఎ.రవికుమార్ సూచించారు. బలిజిపేట ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఫీల్డ్ అసిస్టెంట్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనుల ప్రణాళిక తయారుచేసేటప్పుడు గ్రామ స్థాయిలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులతో సంప్రదించి సమావేశాన్ని ఏర్పాటుచేసి అవసరమైన పనులను గుర్తించడం ఎంతో మంచిదన్నారు.

గ్రామాలకు అవసరమైన పనులను ప్రతిపాదించడం వలన సామాజికంగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పెదంకలాం కాలువలో పూడికలు, చెత్తచెదారాలు తొలగించేందుకు పనులు ప్రతిపాదనలు చేయాలని సూచించారు. పెదంకలాం కాలువలో ఉపాదిపనుల ప్రతిపాదనల వలన శివారుభూములకు సాగునీరు అందేఅవకాశాలున్నాయన్నారు. పనుల ప్రణాళిక పక్కాగా తయారుచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏపీఓ కేశవరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చురుగ్గా కులగణన సర్వే



చినహరిజనపేటలో జరుగుతున్న సర్వేను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ జయరామ్



చంద్రపువలసలో జరుగుతున్న కులగణన సర్వే

సాలూరు: పట్టణం, మండలంలో కులగణన సర్వే చురుగ్గా జరుగుతోంది. సచివాలయాల పరిధిలో ఆయా సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ప్రజల వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకుని యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ నెల 28 వరకు సర్వే జరుగుతుందని ఎంపీడీఓ పార్వతి తెలిపారు. పట్టణంలో చిన హరిజనపేట సచివాలయంలో జరుగుతున్న సర్వేను మున్సిపల్ కమిషనర్ జయరామ్ శనివారం పరిశీలించారు.

గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి

సీతంపేట: గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి అన్నారు. స్థానిక ఐటీడీఏలో సెక్టోరియల్ అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దేశభక్తి ప్రతిబింబించేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రదానం చేసే ప్రశంసా అవార్డుల ఎంపిక త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సమావేశంలో ఏపీఓ రోసిరెడ్డి, ఈఈ సింహాచలం, జీసీసీ డీఎం సంధ్యారాణి, పీఏఓ హరికృష్ణ, పీహెచ్‌ఓ గణేష్, డిప్యూటీఈఓ లిల్లీరాణి, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానంద్, తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో పైరుకు పోషణ



ఏడీ కె.రత్నకుమారి



పచ్చిరొట్ట సాగు

పాలకొండ రూరల్: సేంద్రియ ఎరువులతో పంటల సాగు అన్ని రకాలుగా శ్రేయస్కరమని వ్యవసాయశాఖ ఏడీ కె.రత్నకుమారి పేర్కొన్నారు. ప్రకృతి సాగు విధానంలో భాగంగా పచ్చిరొట్ట సాగుతో భూమికి కావాల్సిన పోషకాలు లభిస్తాయని, ఫలితంగా ఎరువుల వినియోగం, ఖర్చు తగ్గడంతో పాటు పంట దిగుబడులు పెరుగుతాయన్నారు.

నేలలో నత్రజని స్థాపనం

పచ్చరొట్టగా ఎకరాకు 12 కిలోల జనుమును విత్తితే 5 నుంచి 7 టన్నుల దిగుబడి వస్తుంది. అలాగే 40 కిలోల నత్రజని నేలకు అందుతుంది. ఎకరాకు 15 కిలోల జీలుగు విత్తితే ఐదు నుంచి ఏడు టన్నుల పచ్చిరొట్ట, 60 కిలోల నత్రజని పైరుకు అందుతుంది. ఎకరానికి 15 కిలోల అలసంద విత్తనాలు విత్తుకుంటే 3 టన్నుల పచ్చిరొట్ట, 35 కిలోల నత్రజని భూమికి లభిస్తుంది. 6 కిలోల పిల్లిపెసర ద్వారా 3 టన్నుల పచ్చిరొట్ట, 40 కిలోల నత్రజని లభిస్తుంది. ఎకరాకు 8 కిలోల పెసర విత్తనాలు విత్తుకుంటే మూడు టన్నుల పచ్చిరొట్ట, 25 కిలోల నత్రజని నేలలో నిలుస్తుంది. పెసరసాగు చేసి కాయకోత అనంతరం యాధాస్థితి పొలాన్ని దున్నుకుంటే ఆ వ్యర్థాలు బలవర్ధక ఎరువుగా మారుతాయని వివరించారు. పచ్చిరొట్టపైరు నేలసారాన్ని, భౌతిక లక్షణాలను మెరుగుపరుస్తాయి. అలాగే తేమ నేలలో నిలిచే సామర్థ్యాన్ని గననీయంగా పెంచుతాయి. నేల కోతకు గురికాకుండా, మేలు చేసే సూక్ష్మజీవులను వృద్ధి చేస్తాయి. ఈ రకమైన సేంద్రియతను ముందస్తు ప్రణాళికతో సిద్ధం చేసుకోవటం వలన దిగుబడి పెంచుకోవచ్చు.

తేమ ఉన్నప్పుడే కలియ దున్నాలి..

పచ్చిరొట్ట పైరును పూతదశలో నేలలో కలియ దున్నడం, నేలలో సరైన తేమ ఉన్న సమయంలో మాత్రమే ఈ తరహా విధానం చేపట్టడం శ్రేయస్కరం. నేలలో తేమ ఉన్నప్పుడు పచ్చిరొట్ట పైరుతో సహా కలిపి దున్నితే త్వరగా కుళ్లి భూ సామర్థ్యాన్ని పెంచుతుంది. పవర్ టిల్లర్ లేదా రోటావేటార్ సాయంతో నేలలో పచ్చిరొట్ట కలిసే విధంగా దున్నడం ఓ పద్ధతి. అలా దున్నిన అనంతరం 15 రోజుల వ్యవధిలో పైరు భూమిలో కుళ్లుతున్న సమయంలో ఎకరాకు 50 కిలోల సూపర్‌ఫాస్ఫేట్ ఎరువును చల్లడం ద్వారా మరింత లాభం పొందవచ్చు.